సోవియట్ సమీక్ష

నవంబర్ 6 1987

- అరుదేశాల నాయకుల సంయుక్త ప్రకటనకు గొర్బచేవ్ సమాధానం

- అక్టోబరు విప్లవం నిర్వహించిన చరిత్రాత్మక కర్తవ్యం

- వచ్చే సంవత్సరంలో సోవియట్ ఆర్థిక వ్యవస్థకుగల అవకాశాలు

- సామాజిక ప్రగతికి సునిశ్చిత శాంతి తప్పనిసరిగా అవసరం

సంపుటి 21 సంచిక 45

ప్రియమైన పాఠక మహాశయా,

సోవియట్ సమీక్ష, 1988 సంవత్సరం తొలిసంచిక నుండీ యెక్కువ పేజీలతో, యెంతో ఆకర్షణీయంగా మాస పత్రికగా వెలువడుతుంది. బొమ్మలూ, యింకా యెన్నో ఆకర్షణలకు తోడు, రంగురంగుల ఛాయాచిత్రాలు గల పుటలు ప్రతి సంచికలో వుంటాయి.

వివిధ అంశాలపై అనేక వ్యాసాలుండాలన్న మీ అభిలాషను, యెక్కువ పేజీలతో రానున్న సోవియట్ సమీక్ష తీరుస్తుంది. సిద్ధాంత సమస్యలపైనా, శాంతి, భద్రతా సమస్యలపైనా, అంతర్జాతీయ వ్యవహారాలపైనా సాధికార వ్యాసాలతోపాటు, యీ పత్రికలో యికముందు, వర్ధమాన దేశాల సమస్యలకు, సోవియట్ యూనియన్‌లో ఆర్థిక పునర్వ్యవస్థీకరణ విశేషాలకు, సోవియట్ భారత సహకారానికి సంబంధించిన వ్యాసాలు మరిన్ని వుంటాయి.

సోవియట్ సమీక్షకు యికముందుకూడా మీ ఆదరాభిమానాలు, తోడ్పాటు, సహకారం లభిస్తాయని మా దృఢవిశ్వాసం.

—సంపాదకుడు.

KLVA105M233

సోవియట్ సమీక్ష

సం. 45 సంపుటి 21 1987

నవంబర్ 6

సంపాదకుడు:
వై. ఎల్. ఫ్రొలోవ్
సంయుక్త సంపాదకుడు:
జి. ఆళవందార్
సహాయ సంపాదకుడు:
మునగాల జనార్ధనరెడ్డి
ఆర్టిస్ట్:
ఎల్. వి. గుసేవ

11 భారతీయ భాషల్లో వెలువడే పత్రిక

Printed by A. N. Kazantsev and published by him at Soviet Nadu Office, 115, Theagaraya Road, Madras-600 017, for the Information Department of the USSR Embassy in India Printed at Sri Venkateswara Printers Madras-600 021.

ఇందలి వ్యాసాలను పునర్ముద్రించేవారు "సోవియట్ సమీక్ష" నుండి అని పేర్కొంటే సంతోషిస్తాము.

విషయసూచిక

ఆరుదేశాల నాయకుల సంయుక్త ప్రకటనకు మిహాయిల్ గోర్బచేవ్ సమాధానం

అర్జెంటీనా, గ్రీస్, భారతదేశం, మెక్సికో, టాంజానియా, స్వీడన్‌ల నాయకుల సంయుక్త ప్రకటనకు మిహాయిల్ గోర్బచేవ్ సమాధానం దిగువనిస్తున్నాం:

ఆరుదేశాల నాయకుల చొరవలను సోవియట్ యూనియన్ సదా యెంతో శ్రద్ధతో పరికిస్తోంది. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న ఐదు ఖండాలలోని మెజారిటీ దేశాల ఆశయాలను వారు వ్యక్తంచేస్తున్నారని మా విశ్వాసం. 1987 అక్టోబరు 7వ ఆరుదేశాల బృందంచేసిన సంయుక్త ప్రకటనను కూడా మేము యిదే దృష్టితోచూస్తున్నాం. రెండు తరగతుల మిసైళ్లను మొత్తంగా నిర్మూలించాలని సోవియట్ యూనియన్, అమెరికాల మధ్య సూత్రప్రాయంగా కుదిరిన ఒప్పందం యిచ్చిన వూపును పురస్కరించుకొని, ఆయుధపోటీని అరికట్టి, నిరాయుధీకరణను సాధించేందుకు సర్వతోముఖంగా మరింత విస్తృతమైన చర్యలకోసం ముందుకు సాగాలన్న విజ్ఞప్తి ఈ ప్రకటనలోవుంది.

"ప్రపంచవ్యాప్త ద్విగుణ శూన్యస్థితి" గురించిన ఒప్పందాన్ని, దాని యావత్తు చరిత్రాత్మకతను పరిగణనలోకి తీసుకుంటూ, వ్యూహాత్మకదాడి ఆయుధ నిల్వలను సగానికి సగం తగ్గించడం, దూరరోదసిలో ఆయుధ పోటీని నివారించడం, అణ్వస్త్ర పరీక్షలను అంతమొందించడంలాంటి మౌలిక పరిష్కారాల పథంలో ఒక ఆచరణాత్మకమైన తొలి అంజగా మాత్రమే ఆ ఒప్పందాన్ని పరిగణించాలనికూడా మేము విశ్వసిస్తున్నాము. యీ సమస్యలన్నీ సాధ్యమైనంత త్వరలో పరిష్కారం కావాలన్న రాజకీయ సంకల్పం మాకుందని మానంతుకు మేము మాచేతలద్వారా పదేపదే ధ్రువీకరించాము.

అణ్వస్త్రరహిత, హింసారహిత ప్రపంచాన్ని నిర్మించడం కోసం యిప్పుడు స్పష్టంగాకనిపిస్తున్న పురోగతి కొనసాగేలా చూడాలంటే, యీ లక్ష్యసాధనకై జరుపుతున్న కృషిని అంతర్జాతీయ స్థాయికి తీసుకపోవడమూ, యీ దిశగా కార్యాచరణను, ప్రత్యేకించి, ఐక్యరాజ్యసమితి విధానానికి అనుగుణంగా సాధ్యమైనన్ని రాజ్యాలను సమీకరించడమూ అవసరం. ప్రపంచ రాజకీయాల అభివృద్ధిలో ఒక సరిహద్దుకు చేరుకున్నాం. యిప్పుడిస్థితిలో యుద్ధ ప్రమాదాన్ని తప్పించడానికి, ప్రపంచభద్రత సమగ్ర వ్యవస్థ అనే నిజంగా దృఢమైన భవన నిర్మాణాన్ని ప్రారంభించడానికి సంబంధించిన సమస్యల

పట్ల నూతన వైఖరులను రూపొందించేందుకుగల భవిష్యదవకాశాలను వాస్తవంచేయటం ప్రతిఒక్కరి ఆశయం అయిపోయింది.

ఈ ముఖ్యమైన కృషిలో యీ ఆరుదేశాల బృందం నిర్వహించే పాత్ర నానాటికీ పెరుగుతూనే వుంటుందని మా అభిప్రాయం. మన భూమండలానికి భద్రమైన భవిష్యత్తును సాధించడంకోసం యీ బృందం యేకరీతిగా జరుపుతున్న కృషి యిప్పటికే ప్రపంచ వ్యాప్త గౌరవాన్ని పొందింది.

నిరాయుధీకరణ రంగంలో, ముఖ్యంగా అన్నిరకాల అణు పరీక్షల నిషేధం గురించి కుదిరే ఒప్పందాల తనిఖీ సమస్యపట్ల యీ ఆరుదేశాల బృందానికిగల ఆసక్తి, వస్తుగత వైఖరి మమ్మల్ని యెల్లప్పుడూ ఆకర్షిస్తూనే వుంది. ప్రస్తుతం, అంటే అణు పరీక్షలను పరిమితం చేయడం, వాటిని అంతమొందించడంపై పూర్తిస్థాయి చర్చలు జరుగుతున్న సమయంలో సోవియట్ శాస్త్రవేత్తలు యీ రంగంలో భావి ఒప్పందాల అమలుపై నమ్మకమైన పర్యవేక్షణకు వీలుకల్పించే చర్యలను రూపొందించడంతో నిమగ్నమై వున్నారు. యీ సమస్యను యీ ఆరు దేశాల ప్రవీణులు కూడా అధ్యయనం చేస్తున్నారని మాకు తెలుసు. యీ దిశలో మన శాస్త్రవేత్తలు కృషిని కూడదీసుకోవడానికి అడ్డొచ్చేది యేదీలేదు. తనిఖీల రంగంలో యిలాంటి ఆచరణాత్మక సహకారమూ, సంయుక్త ప్రయోగాలూ అణ్వస్త్ర, పరీక్షల నిలిపివేతపై సమగ్రమైన ఫలప్రదమైన తనిఖీ జరిపే లక్ష్యాన్ని చేరువ చేయగలవని మా నిశ్చితాభిప్రాయం. యిలాంటి సహకారానికి సోవియట్ శాస్త్రజ్ఞులు సంసిద్ధంగా వున్నారు.

ఇంతకన్నా విస్తృతమైన సమస్యలకు, అంటే, ఆయుధాలపై పరిమితి విధింపు, నిరాయుధీకరణలకు సంబంధించిన నిర్దిష్ట సమస్యలకు పరిష్కారం కనుగొనడంలో యీ ఆరు రాజ్యాల చొరవలోగానీ లేదా అంతర్జాతీయ సంబంధాల సమస్త రంగాల్లో యావన్మంది భద్రతను కాపాడటంలో ప్రాకృశ్చిమ, ఉత్తర దక్షిణ రాజ్యాలతో ఆచరణాత్మక చర్యల సమగ్ర కార్యక్రమాన్ని సంయుక్తంగా రూపొందించడంలోగానీ నిర్మాణాత్మక సహకారం నెరవడానికి సోవియట్ యూనియన్ తన మట్టుకు తాను సిద్ధంగావుంది.

నిజమైన నిరాయుధీకరణకోసం, అంతర్జాతీయభద్రత పటిష్ఠీకరణకోసం నిరంతరం కృషి చేస్తున్నందుకుగాను, నేను ముగింపులో ఆరురాజ్యాల నాయకులకు మరోసారి కృతజ్ఞతలు తెలపాలనుకుంటున్నాను.

(టాస్—అక్టోబరు 28, 1987)

అక్టోబరు విప్లవం నిర్వహించిన చరిత్రాత్మక కర్తవ్యం

ప్రొఫెసర్ జి. త్రుకాన్, (డి. ఎస్సి. చరిత్ర)

సోవియట్ యూనియన్ విజ్ఞానశాస్త్రాల అకాడమీలోని

సోవియట్ యూనియన్ చరిత్ర ఇన్‌స్టిట్యూట్ డిప్యూటీ డైరెక్టర్

మానవ అభివృద్ధిలో మౌలికంగా ఒక నూతన మార్గాన్ని అక్టోబరు విప్లవం ఆవిష్కరించింది; ఇది న్యాయమైన సమాజానికి బాట వేసిన మార్గం. రష్యా ప్రజలు తమ చరిత్రాత్మక యెంపికచేసుకుని సోషలిజాన్ని ఆచరణాత్మకంగా సృష్టించడానికి పూనుకున్నారు. అంతకుముందు సోషలిజం సిద్ధాంతంలో మాత్రమే వుండింది.

రష్యాను మరమ్మతు చేయడానికి అక్టోబరు విప్లవం ఒక శక్తివంతమైన ఉత్ప్రేరకంగా వుండింది. యిది రష్యా సామాజిక, ఆర్థిక అభివృద్ధిని త్వరితం చేసింది; ప్రగతిని వేగిరపర్చడానికి సోషలిజం సమకూర్చగల అపారబలాన్ని, అవకాశాలను సుస్పష్టంగా తెలియజేసింది. ఊహించ వీలులేని విజయాలను సోవియట్ రాజ్యం సాధించింది; వెనుకబడివున్న యీ దేశం చారిత్రకంగా చాలా స్వల్ప వ్యవధిలోనే ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన దేశాల్లో ఒకటైంది. విస్తృత పరిధిగల అనేక రంగాల్లో తన విజయాల ద్వారా, తన అపారమైన ప్రగతిద్వారా సోవియట్ రాజ్యం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. భారీ ఆధునిక ఇనుము, ఉక్కు ఫ్యాక్టరీలు వెలుస్తూండడంవల్ల, వెనుకబడ్డ సరిహద్దు ప్రాంతాల్లో గనుల, జలవిద్యుత్ కేంద్రాల, రైలుమార్గాల నిర్మాణాన్ని చేపట్టడంవల్ల దేశం ఒక బ్రహ్మాండమైన నిర్మాణప్రదేశంగా మారిపోయింది. తరతరాల గ్రామీణ జీవన విధానంలో పరివర్తన, నిరక్షరాస్యతా నిర్మూలన (జనాభాలో సుమారు 75 శాతం), యూనివర్శిటీల, ఇన్‌స్టిట్యూట్‌ల, పరిశోధనా కేంద్రాల స్థాపన—యివన్నీ అందరికీ అమితాశ్చర్యాన్ని కల్గించాయి. యివీ, యింకా కొన్నీ సోషలిజానికి పునాదులు వేసిన సంవత్సరాలలో జరిగాయి. 1940 లో అంటే రెండవ ప్రపంచయుద్ధానికి ముందు ప్రపంచ పారిశ్రామిక వుత్పత్తుల పరిమాణంలో సోవియట్ యూనియన్ రెండవ స్థానాన్ని చేరుకున్నది.

నూతన సమాజ పథనిర్దేశకులు, నిర్మాతలు గడిచిన పథం యెంతో కష్టభూయిష్టమైనదిగా వుండింది. యీ బ్రహ్మాండమైన సామాజిక ప్రయోగాన్ని భగ్నం చేయడానికి, నాశనం చేయడానికి పెట్టుబడిదారీ ప్రపంచం బరితెగించి చేయగలిగినదంతా చేసింది. విదేశీ శక్తుల సాయుధజోక్యం (1918-22)వల్ల, వాటి తోడ్పాటుతో ప్రారంభమైన అంతర్యుద్ధంవల్ల అపార జననష్టం జరిగింది. యివి సోవియట్ రష్యా ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేశాయి.

దేశంలోను, దేశం బయటాగల విప్లవ ప్రతీఘాతకులపై విజయంసాధించిన తర్వాత

కూడా దేశంలోని పరిస్థితి సంక్లిష్టంగానే వుండింది. రష్యాను పెట్టుబడిదారీ ప్రపంచం చుట్టుముట్టి, ఏకాకిగా చేసింది. చేపట్టిన సోషలిజం నిర్మాణాన్ని పూర్తిచేయడానికి అపారమైన కృషి అవసరమైంది. ముందుకు సాగడానికి దీక్ష దక్షతలు సోవియట్ ప్రజలకు వుండినాయి: కాని అప్పుడప్పుడు వాటికి విప్లవ ఆతురతవల్ల, పురోగమన వేగానికీ, సమాజాన్ని విప్లవకరంగా మార్చివేయడానికి గల అవకాశాలకు సంబంధించిన సరళీకృత భావాలవల్ల, యిందుకు అవసరమైన అనుభవం కొరతవల్ల చిక్కులు కలిగాయి. తప్పుడు అంచనాలు, పొరపాట్లు, అప్పుడప్పుడు నాటకీయ స్వభావం గలవిగా వుండినాయి. యీ తప్పుడు అంచనాలు వేయడం, పొరపాట్లు చేయడం సోషలిస్టు అభివృద్ధి క్రమంలో జరిగింది. యిదికూడా చారిత్రక సత్యం. 1930లలో జరిగిన స్టాలినిస్టు అణచివేతలు సోవియట్ సమాజానికి తీవ్రమైన హాని చేశాయి. కానీ ఒక బలమైన సోషలిస్టు రాజ్యాన్ని నిర్మిస్తూండిన దేశప్రజల వీరోచిత కృత్యాన్ని అవి సన్నగిల్లజేయలేకపోయాయి.

యావన్మంది దేశ ప్రజల అపారమైన సృజనాత్మక శక్తి స్తోమతలను అక్టోబరు విప్లవం కదలికలో పెట్టడం వల్లనే యిది సాధ్యమైంది. తమ ప్రత్యక్ష కృషివల్ల పాత ప్రపంచం పేకమేడలాగా కూలిపోవడాన్ని, తమ దేశంలో మార్పులు సంభవించడాన్ని ప్రజలు గమనించి చరిత్రను సృష్టించడంలో తాము ప్రత్యక్ష భాగస్వాములమన్న అనుభూతిని పొందారు. 1920 ల, 1930 లలోని అసాధారణ విప్లవకర వుత్తేజానికి, శ్రామిక వెల్లువకూ కారణమిదే.

దేశభక్త మహా యుద్ధకాలంలో (1941-45) సోవియట్ ప్రజ సామూహిక వీరత్వాన్ని ప్రదర్శించి నాజీదండయాత్రకు వ్యతిరేకంగా గట్టిగా నిల్చింది. యిది నాజీ జర్మనీని చిత్తు చేయడంలో నిర్ణయాత్మక పాత్రవహించింది: సైనికవాద జపాన్ పరాజయానికి, దాస్యబంధనాల్లోవున్న యూరప్, ఆసియాదేశాల ప్రజల విముక్తికి ముఖ్యమైన దోహదమొనర్చింది. సోవియట్ యూనియన్ 20 మిలియన్లమందిని కోల్పోయినప్పటికీ అది నాజీజానికి—యీ నాజీజం సైనిక బలానికి దాదాపు మొత్తం యూరప్ పారిశ్రామిక శక్తిస్తోమతలు దన్నుగా వుండినాయి—వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో విజేతగా అవతరించింది.

నాజీ జర్మనీ, సైనికవాద జపాన్‌పై సాధించిన యీ విజయం ప్రపంచ చరిత్ర గమనంపై శక్తివంతమైన ప్రభావాన్ని నెరపి ప్రపంచవ్యాప్త పరివర్తనలక్రమాన్ని త్వరితపర్చింది. సోవియట్ యూనియన్ సరిహద్దును దాటి సోషలిజం విస్తరించింది: ప్రపంచ సోషలిస్టు వ్యవస్థ యేర్పడింది. సోషలిస్టు దేశాల విస్తీర్ణం యిప్పుడు మొత్తం ప్రపంచ భూభాగంలో 26.2 శాతంవుంది. ప్రపంచంలోని సుమారు మూడవవంతు ప్రజలు యీ దేశాల్లో నివసిస్తున్నారు. మొత్తం ప్రపంచంలోని పారిశ్రామిక వుత్పత్తిలో 40 శాతానికి పైగా యీ దేశాలు వుత్పత్తి చేస్తున్నాయి. ప్రపంచ రంగంపైకి వచ్చిన గుణాత్మకమైన యీ నూతన అంశం, ప్రపంచశక్తుల పొందికను సామాజిక ప్రగతి శక్తులకు అనుకూలంగా మార్చివేసింది.

ప్రపంచంలోని దేశదేశాల ప్రజల జాతీయ విముక్తి పోరాట చరిత్రాత్మక విజయంకూడా అక్టోబరు విప్లవంతో ముడివడి వుంది. "సోవియట్ విప్లవం వెలిగించిన వుజ్వల జ్యోతిని ఆర్పివేయడం సాధ్యంకాదు" అని

భారతదేశ మహత్తర పుత్రుడు జవహర్‌లాల్ నెహ్రూ రాశారు. ఒక ప్రత్యామ్నాయ వ్యవస్థ వునికిలోకి వచ్చింది, అది స్వయంగా వలస వాదానికి సవాల్‌గా వుండింది. సోవియట్ యూనియనూ. ఆ తర్వాత వెలసిన సోషలిస్టు దేశాల కుటుంబమూ పీడిత దేశాల ప్రజలకు ఆశను కల్గించాయి, ఆదర్శాన్నినెలకొల్పాయి; ఆతర్వాత సహాయం చేశాయి, రక్షణను సమకూర్చాయి. యిదంతా సామ్రాజ్యవాద వలస వ్యవస్థ పతనానికీ, ప్రపంచ రాజకీయ పటంలో మార్పులకూ కారణమైంది. ప్రపంచ రాజకీయ పటంలో వందకు పైగా కొత్త స్వతంత్రరాజ్యాలు అవతరించాయి. ఒకప్పుడు పీడనకు గురైన యీ దేశాల స్వతంత్ర అభివృద్ధిలో యిబ్బందులు వున్నప్పటికీ వీటి గమ్యాలలో అపారమైన సానుకూల మార్పు స్పష్టంగా కనిపిస్తోంది.

విభిన్న సామాజిక వ్యవస్థలుగల రాజ్యాల మధ్య శాంతియుత సహజీవన భావనల్ని మొట్ట మొదటిసారిగా సోవియట్ విదేశాంగ విధాన మార్గదర్శక సూత్రంగా ప్రకటించడం జరిగిందన్న వాస్తవం కూడా ప్రపంచ చరిత్ర గమనంపై అక్టోబరు విప్లవ ప్రభావాన్ని తెలియజేస్తోంది. ప్రపంచ విప్లవంపై కమ్యూనిస్టులు పెట్టుకున్న ఆశలను కప్పిపుచ్చుకోడానికి యిది ఒక కపటమైన యెత్తుగడ అని సోషలిజానికి సైద్ధాంతిక శత్రువులైన వారు ప్రకటించారు. సమీప భవిష్యత్తులో అంతర్జాతీయ శ్రామిక వర్గ విప్లవం విజయంపొందుతుందనే భావనల వ్యాప్తిని అక్టోబరు విప్లవానంతర వస్తుగత, ఆత్మగత పరిస్థితులు పెంపొందించిన మాట నిజమే. కాని సోషలిజాన్ని ఎగుమతి చేయలేమని లెనిన్ అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ ట్రాట్‌స్కీ, ఆయన మద్దతుదార్లు ప్రపంచ విప్లవ విజయంతోనే రష్యా భవితవ్యం ముడిపడివుందని అదే పనిగా వాదించారు. అంటే బలవంతంగా విప్లవాన్ని నెట్టాలని వారి అభిప్రాయం. విప్లవోద్యమానికి హానికరమైన యీ అతివాద దుందుడుకు పంథాకు లెనిన్ బద్ధవిరోధి. మానవ జీవితం నుండి యుద్ధాన్ని నిర్మూలించడానికి బాటవేస్తూ, అంతర్జాతీయ సంబంధాల్లో నూతన రాజకీయ ఆలోచనా ధోరణికి లెనినిస్టు శాంతి విధానం పునాదివేసింది. యీ నూతన రాజకీయ ఆలోచనా ధోరణి మనకాలపు విధాయకమైంది. శాంతియుత సహజీవనం; రెండు వ్యవస్థల మధ్య వివాదాస్పదమైన సమస్యలను సైనిక పద్ధతుల్లో పరిష్కరించుకోడానికి పరస్పరం పూనుకోకుండా వుండడం—యివి యీనాడు మానవాళిని ప్రమాదంనుండి కాపాడటానికి పూర్వాపేక్షితంగావున్నాయి. నూతనప్రపంచ దృక్పథాన్ని కూడా యీ నూతన పరిస్థితిలో మనం ఆకళింపు చేసుకుంటున్నాం—అది గంతలులేని, పిడివాదాలులేని, కట్టుకథలుల్లేని, దురభిప్రాయాలులేని ప్రపంచ దృక్పథం.

రాజ్యాల, వర్గాల, జాతుల సమస్త ప్రయోజనాలను సోవియట్ యూనియన్ దృష్టిలో పెట్టుకుని అణుమహోపద్రవ సర్వనాశన ప్రమాదం మానవాళికి లేకుండా చేయడానికి తిరుగులేని ప్రాధాన్యతను యిచ్చింది. 1986 లో సోవియట్ కమ్యూనిస్టు పార్టీ 27 వ మహాసభ రూపొందించిన సర్వావృత సమగ్ర అంతర్జాతీయ భద్రతా వ్యవస్థ పునాదుల్లో, యీ శతాబ్దంలోగా అణ్వాయుధాలను నిర్మూలించడానికి సోవియట్ యూనియన్ తీసుకున్న మొత్తం చొరవల పరంపరలో శాంతికి సంబంధించిన నూతన తాత్వికత విశిష్టంగా మూర్తీభవించి వుంది. అన్నీ విధి నిర్ణయిస్తుందనే, చొరవను చంపే వాదనను సోషలిస్టు దేశాలు తిరస్కరిస్తూ, మొత్తం

మానవాళి సంయుక్త కృషిద్వారా చరిత్ర గమనాన్ని ప్రభావితంచేసే భావనను ప్రతిపాదించాయి. న్యాయమైన సహకారంద్వారా, రెండు వ్యవస్థల మధ్యగల సహజమైన పోటాపోటీలను మరింత నిర్మాణాత్మకంగా మార్చడంద్వారా పరస్పర బెదిరింపులను, సాయుధ తలపాటును తొలగించడమే సోవియట్ యూనియన్, యితర సోషలిస్టు దేశాల విదేశాంగ విధాన లక్ష్యం. అక్టోబరు విప్లవం నుండి వుద్భవించిన వ్యవస్థ చారిత్రాత్మక కర్తవ్యం కచ్చితంగా యిదే.

జాతుల సమస్యను పరిష్కరించే ఒక ఆదర్శాన్ని అక్టోబరు విప్లవం సమకూర్చింది: యిది మానవాళి చరిత్రలో అత్యంత బాధాకరమైన, అత్యంత వుద్రేకపూరితమైన సమస్యల్లో ఒకటి. ఒకప్పుడు రష్యాలో పీడనకు గురైన జాతులు స్వయం నిర్ణయాధికార హక్కును వినియోగించుకునే అవకాశం అక్టోబరు విప్లవంవల్ల లభించింది: సమానత, స్వేచ్ఛ, ఏకీకృత రాజ్య చట్రపరిధిలో స్వచ్ఛంద సోదర సహకారం ప్రాతిపదికపై జాతీయ పునరుద్ధరణకోసం, అభివృద్ధికోసం పాదార్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులను సమకూర్చడంద్వారా ఆ హక్కును వినియోగించుకునే అవకాశాన్ని అది కల్పించింది. అప్పుడు రష్యాలోని జాతులు వివిధ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అభివృద్ధి స్థాయిల్లో వుండినాయి. సోషలిజం వాటి అభివృద్ధిని ఒకే స్థాయికి తెచ్చింది: సమస్త జీవిత రంగాల్లో జాతుల, నరవర్గబృందాల వాస్తవ సమానతకు హామీకల్పించింది: రూపంలో జాతీయత గల, సారంలో సోషలిస్టు అయిన సంస్కృతి వికాసానికి హామీకల్పించింది. శాత్రవ వైరుధ్యాలను నిర్మూలించడం సాధ్యంకాదనే కట్టుకథను యీ నూతన వ్యవస్థ తోసిపుచ్చింది. ప్రజలను విభజించే జాతీయపరమైన అంశం సోవియట్ యూనియన్‌లో లేకుండా పోయింది.

సోవియట్ యూనియన్‌లోని జాతుల అంతర్జాతీయతా ఐక్యత చరిత్రలో మొట్టమొదటిసారిగా సామాజిక పురోగతికి ప్రధాన అంశాల్లో ఒకటైంది. అయితే అంతర్జాతీయ ప్రబోధకృషి కొరవడిన ప్రాంతాల్లో ఆరోగ్యకరమైన యీ వ్యవస్థ దేహంలోకి అప్పుడప్పుడు సంకుచిత జాతీయ విషక్రిములు చొరబడుతున్నాయి. అల్మాఅటాలో, సోవియట్ బాల్టిక్ రిపబ్లిక్కుల రాజధానుల్లో యువజనబృందాల సంకుచిత జాతీయ చర్యలు యిందుకు ఒక ఉదాహరణ. యీ చర్యలను, "హక్కులులేని జాతుల శక్తివంతమైన నిరసన"గా, పాశ్చాత్య ప్రచారం ప్రకటించింది. యీ రిపబ్లిక్కులను సోవియట్ యూనియన్ తనలో బలవంతంగా కలిపివేసుకున్నదట. వాస్తవంలో యీ చర్యలకు చిన్న చిన్న రాజకీయ తీవ్రవాద బృందాలు పాల్పడ్డాయి. అవి బాహాటతను, ప్రజాస్వామ్యాన్ని దుర్వినియోగపరుస్తూ జాతీయ మాన్యతకు సంరక్షకులుగా పోజుపెట్టడానికి ప్రయత్నించాయి. కాని హానికరమైన, రెచ్చగొట్టే యీ చర్యలకు ప్రజలు దూరంగా వుండిపోయారు.

సోవియట్ యూనియన్‌లో నూతన చారిత్రక పరిస్థితుల్లో యిప్పుడు జరుగుతున్న మార్పులు అక్టోబరు విప్లవ ఆదర్శాల, భావనల ప్రత్యక్ష ఫలితమే. యిప్పుడు అమలు జరుగుతున్న సాహసోపేతమైన, ప్రగాఢమైన పరివర్తనలు, లక్ష్యాల, కర్తవ్యాల పరిధి— యివి పునర్వ్యవస్థీకరణ వుద్యమాన్ని ఆ విప్లవంతో పోల్చదగినట్లుచేస్తున్నాయి. ప్రజలపై, వారి సంకల్పంపై, వారి సామాజిక బాధ్యతా

భావంపై, న్యాయంపై ఆధారపడడం అనేది 1917 లోవి, 1987 లోవి ప్రధాన అంశం. కార్మికుల, కర్షకుల, మైనికుల విస్వార్థచర్యల వల్లనే అక్టోబరు విప్లవ విజయం సాధ్యమైంది. యావన్మంది సోవియట్ ప్రజల అత్యంత శక్తివంతమైన చర్యలవల్లనే పునర్వ్యవస్థీకరణ ఉద్యమ విజయం సాధ్యమౌతుంది. సామాన్య ప్రజలను చరిత్రాత్మకమైన సృజనాత్మక కృషి శిఖరానికి చేర్చడమే అక్టోబరు విప్లవ పరమోన్నత కర్తవ్యంగా వుండిందని లెనిన్ నొక్కిచెప్పారు. యీనాటి ప్రధానాంశం కూడా మానవహంశానికి ప్రేరణ యివ్వడమే.

దేశచరిత్రలో నిర్ణయాత్మకమైనమార్పులు జరుగుతున్న యీ దశలో కాలంచెల్లిన అభిప్రాయాలను, నినాదాలను పట్టుదలతో పెకిలించివేయడంపట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చడం సోవియట్ సమాజం నేడు నెరవేరుస్తున్న కర్తవ్యాల దృష్ట్యా అవసరం. ప్రస్తుత పునర్వ్యవస్థీకరణ కృషికీ, సోషలిజం నిర్మాణ కాలంనాటి కృషికీ మధ్యపోలికలను యెవరు యేవిధంగా చెప్పినప్పటికీ యిబ్బందులన్ను, పొరపాట్లను సాహసోపేతంగాఒప్పుకోవడం, ఆత్మవిమర్శ చేసుకోవడం, జనబాహుళ్యాల శక్తి స్తోమతలపై విశ్వాసం, మనం నూతన కల్పనా వేత్తలుగా వున్నామని చేతలద్వారా రుజువుచేసుకోవాల్సిన అవశ్యకత—యివి యీనాటికీ ముఖ్యమైన విషయాలుగా వున్నాయి.

సోషలిజం ఆదర్శాలకు సోవియట్ ప్రజ నిబద్ధత, దాన్ని మెరుగు పర్చుకోవాలనే సోవియట్ ప్రజ అభిలాష—యివి పునర్వ్యవస్థీకరణ కృషిని అక్టోబరు సోషలిస్టు మహత్తర విప్లవంతో పోల్చుకునేట్టుచేస్తున్నాయి. అభివృద్ధి విరోధక యంత్రాంగాన్ని నిర్ణయాత్మకంగా బద్దలుకొట్టాలి; అంటే యీలక్షణాలను, పనికి సంబంధించిన యథాతథవాద రూపాలను, పద్ధతులను, సోషలిజానికి పరాయమైన ఆలోచనలను అధిగమించాలని దీనర్థం. సామాజిక జీవిత నిర్వహణకు సంబంధించిన నటువంటి కాలంచెల్లిన అనేక స్వరూపాలను, పద్ధతులను పునర్ నిర్మించాల్సి వుంది. తుది విశ్లేషణలో యిది సామాజిక పురోగతిని, పునర్నవీకరణ మౌలిక సాధనాలను—బాహాటత, ప్రజాస్వామ్యీకరణ, విమర్శ, ఆత్మవిమర్శ, ప్రజాఅజమాయిషీ—త్వరితపర్చడం అని అర్థం. సోవియట్ సమాజాన్ని మౌలికంగా ఒక గుణాత్మకదశకు పరివర్తింపజేసేందుకు యివి హామీలు. వీటన్నిటినీ యిటు నూతన వ్యవస్థ చారిత్రాత్మక విజయాలు, అటు తలెత్తిన స్తబ్ధతను తక్షణమే తొలగించాల్సిన ఆవశ్యకతలూ పురికొల్పాయి. యిదీ సోవియట్ యూనియన్‌లో జరుగుతున్న విప్లవకర మార్పుల సారాంశం.

వచ్చే సంవత్సరంలో సోవియట్ ఆర్థిక వ్యవస్థకుగల అవకాశాలు

జి. పిసారెవ్‌స్కీ

ముమ్ముందు మన జీవితంలో యెంతో క్లిష్టమైన సమయం ఎదురౌతుందని అనిపిస్తోంది. యెందుకంటే రానున్న సంవత్సరం పునర్వ్యవస్థీకరణ కృషి తారాస్థాయినందుకునే సంవత్సరం కానున్నది.

ఎందుకు? యెందుకంటే 1991 నాటికి మనం పూర్తిగా కొత్త ఆర్థిక నమూనాను నెలకొల్పనున్నాం. అది సోషలిజానికి, మన సువిశాల దేశ నిర్దిష్ట లక్షణాలకు తగినట్టుగా వుంటుంది. చరిత్రలో సాటిలేని ఆర్థిక యంత్రాంగంగా అది వుంటుంది.

ఇది యెటువంటి నమూనా? సైద్ధాంతికంగా అది ఇప్పటికే అమలులోవుంది. దీనికి సంబంధించిన పథకాన్ని సోవియట్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ 1987 జూన్ ప్లీనరీ సమావేశం ఆమోదించింది. ప్రభుత్వ పరిశ్రమాది సంస్థలగురించిన చట్టం (యిది 1988 జనవరి 1 వ తేదీనుండి అమలులోకి వస్తుంది) దీనికి ప్రాతిపదిక. అందులో పని నిర్వహణకు సంబంధించిన పది మౌలిక సంస్కరణలు వున్నాయి: ప్రణాళికా రచన, ధరల నిర్ణయం, ఆర్థిక వనరులు, బ్యాంకింగ్, శాస్త్ర, సాంకేతిక ప్రగతికి సంబంధించిన మేనేజిమెంటు, తదితరాలు. ఆర్థిక మేనేజిమెంటు సమూల సంస్కరణ అనే పత్రాల సంపుటిని యిటీవలే వెలువరించారు. మొత్తం 256 పేజీలువున్న యీ పుస్తకం ప్రతులు ఐదు లక్షలు ప్రచురించారు. యీ పుస్తకంలోని ప్రతి పేజీలోని ప్రతి పేరాగ్రాఫుకు సవివరమైన వ్యాఖ్యానం అవసరమని చెపితే నమ్మండి.

సోషలిజం సామర్థ్యాన్ని గరిష్ఠంగా ముమ్మరం చేయడం, సామాజికంగా ఆమోదయోగ్యం చేయడం యీ ఆర్థిక పునర్వ్యవస్థీకరణ ప్రధాన లక్ష్యం.

దీన్ని యెలా సాధిస్తారు? సోషలిజానికి మౌలికంగాగల ఆధిక్యతలను ఫలదాయకంగా వినియోగించడం ద్వారా సాధిస్తారు. అంటే యేమిటి? యిది కేంద్రీకృత ఆర్థిక మేనేజిమెంటు అని పిడివాద మన సత్వం గలవారు చెప్పారు, యింకా చెపుతూనేవున్నారు. ఒక సంవత్సరకాలంలో చాలా పెద్ద సంఖ్యలో జరిగే పనులపై 18 మిలియన్ల మేనేజిమెంట్ సిబ్బంది పట్టు విడుపులేని అజమాయిషీని నిర్వహించడం సాధ్యమా?

అవరోధాలు, వైఫల్యాలు, స్తబ్ధతలు, మేనేజిమెంటు అవకతవకలు అందువల్లనే సంభవిస్తున్నాయి: అవధులులేని దాన్ని అజమాయిషీ చేయడం అనేది అసాధ్యం. దీన్ని దృష్టిలో పెట్టుకునే కావచ్చు ఆర్థిక వ్యవస్థపై సంపూర్ణంగా ప్రభుత్వ అజమాయిషీని "మూర్ఖత్వం, ఆత్మహత్యాసదృశం" అనీ "యెందుకంటే ఆర్థికంగా యిది అసాధ్యం" అనీ లెనిన్ వర్ణించారు.

లెనినిజాన్ని పిడివాదంగా మార్చివేస్తూ స్టాలిన్ సమాజ జీవితంలోని అన్ని రంగాలపై

సంపూర్ణంగా ప్రభుత్వ నియంత్రణ నమూనాను సృష్టించారు. కొంతకాలంపాటు ఆ నమూనా పనిచేసింది. మనం యెంతో సాధించినమాట నిజమే: దేశాన్ని పారిశ్రామికీకరించాం: మన విజ్ఞాన శాస్త్రాన్ని అభివృద్ధి చేశాం: నాజీజాన్ని చిత్తుచేశాం. యిది అన్నిటికి పరివ్యాప్తమైనదిగా, అంతా సమర్థనీయమైనదిగా కనిపించవచ్చు. కాని అది అలా జరుగలేదు. మానవ జీవితం అమూల్యమైనది. జీవితమనేది అనవసరమైన త్యాగాలతోనేకాక అసమర్థమైన మేనేజిమెంటువల్ల, విచక్షణా రహితంగా ప్రవర్తించడం వల్ల తలెత్తిన యిబ్బందులకుకూడా గురైంది.

కేంద్రీకృతం అనేది మాత్రమే సోషలిజానికి గల ఆధిక్యత అని నేననుకోవడంలేదు. విడివిడి వ్యక్తుల ప్రయోజనాలను, సమిష్టి, ప్రభుత్వ ప్రయోజనాలను, యావన్మంది ప్రజల ప్రయోజనాలను సోషలిజం మేళవించి, సమ్మిశ్రణం చేస్తుంది. యిది యెంతో ముఖ్యమైన విషయం. కచ్చితంగా చెప్పాలంటే పునర్వ్యవస్థీకరణ తుదిలక్ష్యమిదే. యిందులో విజయం సాధించడానికి యేకైక మార్గం ప్రజాస్వామ్యీకరణ, ప్రజల పరిపాలనను అభివృద్ధిపర్చడం.

ఎంతో నిర్దిష్టమైన యీ అంశానికి సుదీర్ఘమైన వుపోద్ఘాతం రాసినందుకు క్షమించాల్సిందిగా పాఠకులను కోరుతున్నాను. సోవియట్ యూనియన్ సుప్రీం సోవియట్ అక్టోబరు 20 న ఆమోదించిన 1988 సంవత్సరపు దేశ సామాజిక, ఆర్థిక అభివృద్ధి పథకాన్ని యీవిధంగా మాత్రమే పరిశీలించాల్సివుంటుంది.

ఇది 60 వ వార్షిక ప్రణాళిక (మొదటి వార్షిక ప్రణాళికను 1929 లో "పంచవర్ష ప్రణాళిక" భావన మొదటకలిగినపుడు ఆమోదించారు). యీ ప్రణాళిక రూపంలోకన్నా వస్తువులో అంతకుముందున్న ప్రణాళికలకు భిన్నంగావుంది.

1988 లో మన ఆర్థికవ్యవస్థ చెప్పాలంటే రెండు చక్రపరిధుల్లో అభివృద్ధి చెందుతుంది: యిందులో కొత్తది భవిష్యత్తును లక్ష్యంగా పెట్టుకుంటుంది; దీన్ని ప్రస్తుతానికి ప్రణాళికా రచన, మార్కెట్ చక్రపరిధి అని పిలువచ్చు. యిక రెండవది పాతది, సాంప్రదాయకమైనది, గతంనుండీ వస్తున్నదే. 12 వ పంచవర్ష ప్రణాళికా కాలం (1986-1990) చివరివరకూ మున్ముందు జరగాల్సిన పనిలోని సంక్లిష్టత, విరుద్ధ స్వభావం వున్నది యిందులోనే.

1988 లో పారిశ్రామికోత్పత్తిలో 60 శాతం వాటావుండే వేలాది పరిశ్రమాది సంస్థలు, లాభనష్టాలను సంపూర్ణంగా బేరీజు చేసుకునే పద్ధతులకు అంటే సంపూర్ణ ఆర్థిక స్వయం ప్రతిపత్తి, ఆర్థిక బాధ్యతలను స్వీకరించే పద్ధతులకు మారుతాయి. పశ్చిమ దేశాల సంస్థలకూ, మన సంస్థలకూవున్న ఒకే ఒక తేడా యేమంటే మన సంస్థలను ప్రభుత్వం నడుపుతుంది: పరిశ్రమాది సంస్థలను సమిష్టి శ్రామిక బృందాలు అద్దెకు తీసుకుంటాయి. స్వీకరించినఆర్డర్లను నెరవేర్చడంద్వారా లాభాలను సంపాదించడం మన పరిశ్రమాది సంస్థల కృషిలో ప్రధాన అంశంగా వుంటుంది.

ఈ ఆర్డర్లలో ఒక భాగానికి, చాలా గణనీయమైన భాగానికే ప్రభుత్వం గ్యారంటీయిస్తుంది. మిగతా సరకులను మార్కెట్లలో అమ్ముకోవాల్సిందే. యెవరి పరిస్థితి యేమిటి, పరిశ్రమాది సంస్థలు వుత్పత్తి చేస్తున్నదేమిటి, వుత్పత్తులను వినియోగదారు అంగీకరిస్తారా లేదా అవి నాసిరకం సరకులా అనే విషయం తేలేది మార్కెట్టులోనే. సరకు విలువకు

తగ్గట్టుగానే మార్కెట్టులో ధర లభ్యమా తుంది. ఆర్థిక మేనేజిమెంటు నాణ్యతను తనిఖీచేసేది వినియోగదారే.

ఆర్థిక పునర్వ్యవస్థీకరణ ప్రధాన పోరాటాలు జరిగేది మార్కెట్లలోనే, విలువ నియమంపైనేనని నా నమ్మకం. తన దేశాన్ని సంస్కరించడం, తన సమాజాన్ని సంస్కరించడం, తనను తాను సంస్కరించుకోవడం యెవరికైనా కష్టమే. తన నూతన ఆర్థిక విధానం ద్వారా సోషలిజాన్ని కాపాడిన లెనిన్ అది యెంతో కష్టతరమైనదని గ్రహించారు. మన కర్తవ్యాన్ని నెరవేర్చగలమనే నమ్మకం నాకుంది: యెందుకంటే ప్రజలు జటిలమైన పునర్ నిర్మాణ మార్గాన గడిచివచ్చారు, దాన్ని నిరోధించడానికి యెవరినీ అనుమతించరు.

ఇప్పుడు కొన్ని వాస్తవాలను, వివరాలను నేను పేర్కొంటాను. ఈ సంవత్సరంకన్నా 1988 లో జాతీయాదాయం 4.3 శాతం, పారిశ్రామికోత్పత్తి 4.5 శాతం, వ్యవసాయక్షేత్ర వుత్పత్తి 3.4 శాతం పెరుగుతుందని అంచనా.

ఆర్థికాభివృద్ధి సమాజిక లక్ష్యాన్ని మరింత ఎక్కువ చేయడం జరుగుతోంది. విద్య, విజ్ఞానశాస్త్రం, ఆరోగ్యం, సామాజిక భద్రతలపై ప్రభుత్వవ్యయం జాతీయాదాయం కన్నా రెట్టింపు వేగంతో పెరుగుతోంది.

సుమారు 11.5 మిలియన్ మంది ప్రజల గృహవసతిని మెరుగుపర్చడం జరుగుతుంది. 12వ పంచవర్ష ప్రణాళికలోని గృహవసతి కార్యక్రమం నిర్ణీతగడువుకన్నా ముందుగా పూర్తి అవుతుంది. నర్సరీ స్కూళ్లు, కిండర్ గార్టెన్లు, పాఠశాలలు, ఆస్పత్రులు, నాటకశాలలు, సినిమాహాళ్ళు, దుకాణాలు, సేవాసంస్థలు—వీటన్నిటి నిర్మాణం వేగంగా సాగుతోంది.

''ప్రభుత్వ ఆర్డర్లు'' అనే పదం 1988 లో ఆర్థిక కార్య నిర్వహణాధికారుల పదకోశంలో తిరిగి చోటు చేసుకుంటుంది. వస్తువుల సరఫరాకోసం యిచ్చే యీ ఆర్డర్లను తుదకు పోటీ ప్రాతిపదికపై యివ్వడం జరుగుతుంది. యీ పోటీ పథక బద్ధంగా వుంటుంది. గత 60 సంవత్సరాలుగా వున్నట్టు ఆ దేశ పూర్వకమైనదిగా వుండదు.

అదేసమయంలో విస్తృతాభివృద్ధికి యిచ్చే ప్రాధాన్యతపై నాకు కొన్ని అనుమానాలు వున్నాయి. విద్యుదుత్పత్తిని 68 బిలియన్ కిలోవాట్-గంటలు పెంచనున్నారు. తలసరి విద్యుదుత్పత్తిలో సోవియట్ యూనియన్ జపాన్ స్థాయిలోవుంది. కానీ మన దేశమూ, జపానూ ఒక కిలోవాట్-గంటకు వుత్పత్తిచేసే పారిశ్రామిక, యితరవస్తువుల పరిమాణంలో వున్న తేడా సంగతేమిటి?

ప్రభుత్వ ఆర్డర్లకన్నా మించి 6.4 మిలియన్ టన్నుల చమురును, 16 మిలియన్ టన్నుల బొగ్గును, 15 బిలియన్ ఘనపుమీటర్ల గ్యాస్‌ను వుత్పత్తిచేయ తలపెట్టారు. యెందుకోసం? ప్రస్తుతం ప్రపంచంలో అందరికన్నా యెక్కువగా వనరులను వెలికితీస్తున్నాం. పుష్కలంగావున్న ప్రకృతి వనరులను మనం హేతుబద్ధంగా వినియోగించుకోవడం లేదు. వనరుల పొదుపు అనేది నూతన సాంకేతిక విప్లవంలోని కీలకాంశాల్లో ఒకటి.

వచ్చే సంవత్సరం 235 మిలియన్ టన్నుల ధాన్యాన్ని పండించాలనే లక్ష్యం చాలా కఠినమైనదే. యీ సంవత్సరం రైతులు యెన్నో యిబ్బందులను తట్టుకొని పంటలు పండించారు: యెండా కాలంలో, ఆకురాలు కాలంలో యింతటి వర్షాలు ఎన్నడూ కురిసినట్టు నాకు గుర్తులేదు. నష్టాలు జరిగినప్పటికీ పంటలను కాపాడుకోవడం జరిగింది. కానీ యీ నష్టాల

(తరువాయి 16 వ పేజీలో)

సామాజిక ప్రగతికి సునిశ్చిత శాంతి తప్పనిసరిగా అవసరం

వై. క్రాసిన్, డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ

మన కాలంలోని ప్రపంచ వ్యాప్త విప్లవ క్రమం అణు, రోదసీ యుగవాస్తవాల్ని యెదుర్కొనాల్సివుంది. ఇవి, జీవజాలంలోని ఒక జాతిగా మానవాళి మనుగడను సహజావసరంగా చేస్తున్నాయి. యెంత ప్రగాఢమైన వర్గ, సామాజిక వైరుధ్యాలు తమను వేరు చేస్తున్నప్పటికీ యిది సమస్త జాతులకు, దేశాల ప్రజలకు, వర్గాలకు, సామాజిక బృందాలకు సంబంధించిన విషయం. ఆధునిక ప్రపంచం అంతర్గతంగా యెంత సంఘర్షణా భరితమైనప్పటికీ దాన్ని ఒక అఖండ అస్తిత్వాంశంగా పరిగణించడం నూతన రాజకీయ మన సత్యానికి మూలం.

వర్గపోరాటం, సామాజిక ప్రగతి నేడు యిలాంటి ప్రపంచవ్యాప్త ఆధార వ్యవస్థలో వున్నాయి.

వర్గాల మధ్య పోరాటం పర్యవసానంగా ప్రతిసారీ సమాజం విప్లవాత్మక పునర్ నిర్మాణానికి లోనయ్యేది, లేక, పోరాటంలో ఢీకొన్న వర్గాలు నాశనం అయ్యేవి అని మార్క్సు, ఎంగెల్సులు కమ్యూనిస్టు పార్టీ ప్రణాళికలో పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన సామాజిక వ్యవస్థ స్థాపనకోసం వుద్దేశించిన వర్గపోరాటమనేది శత్రు వర్గాల, విరుద్ధ సామాజిక వ్యవస్థల పరస్పర నాశనంతో ముగియకుండా నిరోధించడం కార్మికవర్గ, మన కాలం నాటి సమస్త విప్లవకర శక్తుల ప్రప్రథమ కర్తవ్యం.

తాను పురోగమించి, తన్నుతాను పునర్ని పీనించుకోవాలంటే అసలు సమాజం వుండాలి కదా. నేటి సమాజ గమ్యాలకు యీ ప్రాథమిక సత్యం యెంతో సందర్భోచితమైనది.

అణు, రోదసీ యుగం విసరుతున్న గట్టి సవాలుకు ఫలప్రదమైన సమాధానాన్ని అన్వేషించడానికి అక్టోబరు విప్లవ వారసత్వమ్మూ, సాంప్రదాయాలూ విస్తృతావకాశాలను కల్పిస్తున్నాయి.

అక్టోబర్ విప్లవం జరిగిన వెన్వెంటనే జారీ అయిన శాంతిడిక్రీలో మొట్టమొదట సూత్రీకరించిన సోషలిస్టు రాజ్య విదేశాంగ విధానం లెనిన్ చెప్పినట్లుగా, "సమస్త దేశాల ప్రజలతో శాంతియుత సహజీవన" విధానమే. సోషలిజం ఆవిర్భావంవల్ల రాజకీయ శక్తుల సమతూకంలో పరిమాణాత్మకమైన మార్పు, దాని రూపంలో పరివర్తనలు మాత్రమే కాక అసలు అంతర్జాతీయ సంబంధాల సారాంశంలోనే గుణాత్మక మార్పు సంభవించింది. కొత్త తరహా అంతర్జాతీయ సంబంధాలకు సోషలిజం వేగుచుక్క, వాహికా అయింది. భిన్న సామాజిక వ్యవస్థలు గల రాజ్యాల శాంతియుత సహజీవన సూత్రాలపై నిర్మితమైన సంబంధాలవి.

పరస్పరం ఆంతరంగిక విషయాల్లో జోక్యం: దేశాలు చిన్నవా, పెద్దవా అనే దానితో నిమిత్తం లేకుండా ప్రతిదేశ సార్వభౌమాధికారం, సమానత్వం, ప్రాదేశిక సమగ్రత అనుల్లంఘనీయతలపట్ల గౌరవభావం:

తమ సామాజిక వ్యవస్థను యెంచుకోవడంలో దేశదేశాల ప్రజలకు గల హక్కు గుర్తింపు: అంతర్జాతీయ సమస్యలను శాంతియుత పద్ధతులద్వారా పరిష్కరించుకొనడం: సమానత్వం, సమానభద్రత, పరస్పర ప్రయోజనం —వీటి ప్రాతిపదికపై విరుద్ధ సామాజిక వ్యవస్థలుగల రాజ్యాల మధ్య సంబంధాలను నిర్మించడమని శాంతియుత సహజీవనానికి అర్థం. అంతర్జాతీయ సంబంధాలకు చెందిన యీ ప్రజాస్వామ్య సూత్రాలను అసలు సోషలిజం ఆవిర్భవించకముందే మాటల్లో గుర్తించడం జరిగింది: కానీ, చేతల్లో, వాటిని నిరంతరం వుల్లంఘించడం జరిగింది. బూర్జువా రాజ్యాల విదేశాంగ విధానం నియంతృత్వ ఆచరణలు, హింస, బల ప్రయోగాలపై నిర్మితంకావడం యిందుకు కారణం.

అక్టోబర్ విప్లవంనుండీ ఆవిర్భవించిన సమాజపు శాంతి సాధనశక్తికి మూలం, అసలు యీ సమాజ స్వభావంలోనే వుంది. మానవ సంబంధాల్లోను, అంతర్జాతీయసంబంధాల్లోను హింసను నిర్మూలించడానికి సామాజిక, జాతి పీడనలరద్దు, సహజమైన రంగాన్ని సృష్టించింది. అక్టోబర్ విప్లవం ఆయుధ బలంతో ప్రజలు సాధించిన విజయమనీ, ఆ విప్లవం నూతన తరహా సమాజాన్ని నిర్మించడంలో హింసాయుతచర్యలను చేపట్టిందనీయెవరైనా అభ్యంతరం చెప్పవచ్చు. అయితే, యిది విదేశీ దండయాత్ర సహాయంతో, కాలం చెల్లిన ఒక వ్యవస్థను కాపాడేందుకూ, దాన్ని శాశ్వతం చేసేందుకూ దోపిడీదారులు చేపట్టిన హింసాపద్ధతికి సామ్రాజ్యవాద యుద్ధంలో అలసిపోయిన కార్మికవర్గపు ప్రతిస్పందన మాత్రమేనన్న విషయం యెవరూ మరువరాదు. సోషలిజం ఆశయాన్ని సాధించడానికిగాను గతం నుండీ బయటపడేందుకు అది తప్పనిసరి అయింది. లోతుగా వేరూనిన హింసామూలాలను పెకలించివేసి సాధించిన సమాజ రూపమది. సోషలిస్టు సమాజంలో సామాజిక, లేదా వర్గరీత్యా శత్రువ వైరుధ్యాలుగానీ, యుద్ధాలపై ఆసక్తిగల యెటువంటి వర్గాలు, బృందాలుగానీ వుండవు. యీ రకం సమాజం హింసారహిత పద్ధతులద్వారా, అంటే సైనికేతర పద్ధతుల ద్వారా సాధించ వీలున్న ప్రాధమ్యతలను మాత్రమే తనకు నిర్దేశించుకుంటుంది. యీ ప్రాధమ్య సమస్యల పరిష్కరించడానికి ప్రజలు శాంతియుత శ్రమరూపంలో కృషి చేయవలసివుంటుంది.

సోషలిజం విదేశాంగ విధానం దాని ఆంతరంగికవిధానం కొనసాగింపే. సోషలిస్టు రాజ్యాల ఆంతరంగికవిధానాల లక్ష్యం యిది: ప్రజల సంక్షేమాన్నీ, సాంస్కృతిక ప్రమాణాలనూ పెంచడంకోసమూ, ప్రతిఒక్కరూ పూర్తి స్థాయిలో కృషి చేయడంకోసమూ, అతడు సర్వతోముఖంగా వికాసం చెందడంకోసమూ సామాజిక వుత్పత్తిని పెంచడం. యిలాంటి ఆర్థిక, సామాజిక విధానాన్ని అనుసరించాలంటే దేశంవెలుపల తగిన వాతావరణం ముఖ్యంగా భద్రమైన శాంతి, అంతర్జాతీయ సహకారాలు అవసరం.

లెనిన్ శాంతి డిక్రీకి, సోవియట్ కమ్యూనిస్టు పార్టీ 27వ మహాసభ ప్రతిపాదించిన సర్వావృత అంతర్జాతీయ భద్రతా వ్యవస్థ మౌలిక సూత్రాలకూ మధ్య లోతుగా వేరూరిన పారంపర్యతవుంది. అంతర్జాతీయ సంబంధాలకు విస్తృతమైన, ప్రభావోపేతమైన సంస్కరణలుచేసే పంథానూ, ఆధునిక యుగపు పరిణామ స్వభావానికి నప్పినట్టి, ఆకారణాన, సోషలిస్టు, పెట్టుబడిదారీ రాజ్యాలు రెంటికీ మౌలికంగా అంగీకార్యయోగ్యమైనట్టి ప్రజాతంత్ర సూత్రాలకు

అనుగుణంగా పెద్దయెత్తున ఆ సంబంధాల పునర్నిర్మాణాన్ని పార్టీ మహాసభ ప్రతిపాదించిన సూత్రాలు ప్రతిబింబిస్తున్నాయి. పెట్టుబడిదారీ విధానంనుండి సోషలిజానికి పరివర్తన చెందే యుగపు అంతర్జాతీయ సంబంధాల వ్యవస్థ పరిధిలోని "సంస్కరణవాదపు తరహా చర్యల" అవశ్యకతను గురించి లెనిన్, సునిశితదృష్టితో చెప్పారు. మన కాలంలో స్థిరమైన, చక్కగా నియంత్రితమైన శాంతికి హామీ కల్పించేందుకై యీ రంగంలో సంస్కరణ, మానవ నాగరికత మనుగడకు సహజమైన అవసరమయింది. అలాంటి సంస్కరణ ముసాయిదాను సోవియట్ కమ్యూనిస్టు పార్టీ 27వ మహాసభ తయారుచేసిందంటే, సోషలిజం తన అంతర్గత అభివృద్ధిలో కొత్త సామాజిక కార్యాచరణ పద్ధతులను మాత్రమే గాక, అంతర్జాతీయ వ్యవహారాల్లో కార్యాకలాపాలను సంస్కరించే ప్రజాతంత్ర పద్ధతులను కూడా రూపొందించిందన్నమాట.

కొత్త రాజకీయ ఆలోచనా సరళి సూత్రాలకు అనుగుణంగా అంతర్జాతీయ సంబంధాల వ్యవస్థను ప్రజాతంత్ర యుతంగా సంస్కరించడం యెంత జటిలమైన పనో, 1986 అక్టోబరులో రక్యావిక్‌లో జరిగిన శిఖరాగ్ర సమావేశంలో చక్కగా వెల్లడి అయింది. అన్ని రకాల అణ్వాయుధాలను సమూలంగా తగ్గించి, తుదకు వాటిని పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో, "ఒక మహత్తరమైన రాజీకి" రావటం సాధ్యమేనని ఆ సమావేశం ఒక వైపు నిరూపించింది. మరోవైపు సామ్రాజ్యవాదపు సైనిక, పారిశ్రామిక సముదాయానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బాగా పలుకుబడిగల రాజకీయశక్తులు ఈ రాజీ సాధ్యంకాకుండా అడ్డుపడుతున్నాయనికూడా స్పష్టమైంది. వాటి ప్రతిఘటనను అధిగమించేందుకు సహేతుకమైన వాదనలొక్కటే చాలవు. సంభాషణలు ఏటువైపు మొగ్గుచూపేదీ శాంతికి బలోపేతమైన స్తోమతగావున్న ప్రజాశక్తుల నిర్ణయాత్మక కలాపాలపై ఆధారపడివుంది.

ఆధునిక యుగంలోని సారభూతాంశమైన విప్లవకర మార్పునకు సంబంధించిన సమస్యలను యీ నేపథ్యంలో మనం యెలా చూడాలి? స్థిరమైన, చక్కగా నియంత్రితమైన శాంతి మానవజాతి అసలు మనుగడకే అవసరమని వేరేచెప్ప నవసరంలేదు. అది ప్రతిఒక్కరికీ ప్రయోజనకరమైనది: శాంతి స్థాపన సాధ్యంకావడానికి పూర్వావసరం అదే. కాని, శాంతిరక్షణ, అన్నిటికన్నా ముఖ్యంగా భవిష్యత్తుపై ఆశలుగల వారి ప్రయోజనాలకు అనుగుణమైనది. సోషలిస్టు సమాజపునిర్మాణ సమస్యలను, ఆ సమాజ ప్రగతి సమస్యలను జయప్రదంగా పరిష్కరించేందుకు సునిశ్చితమైన శాంతి ప్రధానావసరం. యీ కొత్తరకం సమాజాన్ని అభివృద్ధి పర్చేందుకు, పెట్టుబడిదారీ వ్యవస్థతో శాంతియుతపోటీలో ఆ సమాజ ఆధిక్యతలు ప్రస్ఫుటమయేందుకు సంబంధించిన కార్యక్రమాన్ని అమలుజరపడానికి, బ్రహ్మాండమైన అదనపు వనరులు శాంతి, నిరాయుధీకరణలవల్ల లభ్యమవుతాయి.

పోటీపడుతున్న సామాజిక వ్యవస్థలలో "దేన్ని యేది ఓడించింది" అన్న సమస్యను, శాంతికోసం జరిగేపోరాటం తనకు తానుగా పరిష్కరించదు అది పెట్టుబడిదారీ

దేశాలలో విప్లవకర మార్పును తీసుకరాదు కూడా. యీ సందర్భంలో చెప్పవలసిందేమిటంటే, అంతర్జాతీయ ఉద్రిక్తతలను సడలింపజేయడానికి, శాంతియుత సహజీవన నేపథ్యంలో సుస్థిరశాంతి దిశగా పురోగమించడానికి వాస్తవ అవకాశాలను సృష్టించేది అదే. శాంతికోసం జరిగే పోరాటం పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా జరిగే పోరాటానికి సమానమైనదైతే అప్పుడు పెట్టుబడిదారీ విధానం వున్నన్నినాళ్ళు సుస్థిర శాంతిని సాధించగలమన్న ఆశే వుండదు.

కాబట్టి, శాంతికోసం పోరాటం తనదైన చట్రంలోనే పెంపొందుతోంది. అది పెట్టుబడిదారీ విధానంనుంచీ సోషలిజానికి సమాజాల పురోగమనం కోసం జరిగే పోరాటాన్ని పోలివుండదు. కానీ, ఆ పోరాటం శూన్యంలో జరగడం లేదు. ఆధునిక కాలపు మౌలిక వైరుధ్యం పనిచేసే రంగంలో జరుగుతోంది. అంటే, ప్రత్యర్థి సామాజిక వ్యవస్థల వైరుధ్యానికి సంబంధించిన రంగంలో జరుగుతోంది. ప్రపంచ రంగస్థలిపై ఘర్షణపడుతున్నదేమిటంటే ఒక దానికొకటి పూర్తిగా విరుద్ధమైన సామాజిక వర్గ స్వభావంగల విదేశాంగ విధాన ధోరణులు. కాబట్టి, యావత్తు మానవాళికి అత్యంత ముఖ్యవిషయమైన శాంతి పోరాటంలో ప్రస్ఫుటమైన సామాజిక వర్గ అంశాలు కూడా వున్నాయి.

అది ప్రగతికి మౌలికంగా అవసరమైన పూర్వాపేక్షితాలను అట్టిపెట్టడానికి వుద్దేశించినది మాత్రమే కాదు, ప్రగతికి దోహదంచేసే శక్తిగా కూడ పనిచేస్తుంది. యెందువల్లనంటే అది సామ్రాజ్యవాదం వుత్పన్నంచేసే దురాక్రమణ ధోరణులకు వ్యతిరేకంగా, వస్తుగతంగా పనిచేస్తుంది. కాబట్టి, ఆ పోరాటంలో పాల్గొనేవారు కొందరు ఆవిషయం గుర్తించకపోయినప్పటికీ, అది స్వతహాగా సామ్రాజ్యవాద వ్యతిరేకశక్తి గలది. సోషలిజం, కార్మికవర్గం, ప్రజాస్వామ్యం, జాతీయ విమోచన యీ శక్తుల మౌలిక ప్రయోజనాలకు, భద్రమైన, బాగా నియంత్రితమైన శాంతి అనుగుణమైనది.

ఏ పరిస్థితుల్లోనైనా, యీ రెండు సామాజిక, ఆర్థికవ్యవస్థల తలపాటు అనివార్యం. కాని, అణు, రోదసీయుగంలో దాన్ని, సుదృఢమైన శాంతియుత పోటీ చట్రంలోనే వుంచాలి. అటువంటి వైఖరి, యీ సమస్య గురించి, సోవియట్ కమ్యూనిస్టు పార్టీ తాజా కార్యక్రమంలో ప్రతిబింబితమైన లెనినిస్టు వ్యాఖ్యకు పూర్తిగా అనుగుణమైనది. అందులో యిలా వుంది: "నేడు ప్రపంచాన్ని విభజిస్తున్న రెండు విరుద్ధ సామాజిక వ్యవస్థల మధ్యగల చారిత్రక వివాదం శాంతియుత పద్ధతుల్లో పరిష్కారం కాగలదు, కావాలికూడా. సోషలిజం తన ఆధిక్యతను ఆయుధబలంతో నిరూపించదు: సమాజ జీవితంలోని ప్రతి రంగంలోనూ ఆదర్శబలంతో, అంటే, ఆర్థిక, విజ్ఞానశాస్త్ర, సంస్కృతి రంగాలను శక్తివంతంగా అభివృద్ధిపరచడం ద్వారా, శ్రామిక ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ద్వారా, సోషలిస్టు ప్రజాస్వామ్యాన్ని ప్రగాఢం చేయడంద్వారా నిరూపిస్తుందనే భావనతో సోవియట్ కమ్యూనిస్టు పార్టీ ముందుకు సాగుతోంది".

సామాజిక ప్రగతిని, తమ అభివృద్ధి,

పంథాలను స్వేచ్ఛగా యెంచుకొనే విషయంలో దేశ దేశాల ప్రజలకు గల హక్కు తప్పకుండా అమలు జరిగేందుకు సానుకూల పరిస్థితులను శాంతి సృష్టిస్తుంది. నూతన ఆలోచనా సరళి అంటే సామాజికవర్గ లక్ష్యాలను, సామాజిక, జాతీయ విముక్తి పోరాటాన్ని విడనాడటంకాదు. అదే సమయంలో, శాంతి, సామాజిక ప్రగతులు ఒక దానిపై ఒకటి అంతగట్టిగా ఆధారపడి వున్నందువల్ల ఆధునికకాలపు విప్లవశక్తులపై అవి యెక్కడ పనిచేస్తున్నా సరే, యెంతో బాధ్యతపడుతోంది. నేడు బ్రహ్మాండమైన ప్రాముఖ్యం సంతరించుకొన్నదియేమిటంటే, ఈ శక్తులు జాతీయ దృష్టితోనేకాక, ప్రపంచ దృష్టితోకూడ, అంటే, ప్రపంచ రాజకీయాల దృష్టితో ఆలోచించగలగటం. వర్గపోరాటం నేటికీ అనివార్యమే. కాని అది, అంతర్జాతీయంగా పెనవేసుకొనివున్న అణు, రోదసీ యుగ వాస్తవాల వ్యవస్థలో పెంపొందుతూంది. అంటే, మానవాళిని కాపాడటం కోసం ఈ వర్గపోరాట రూపాలను, వివిధ శక్తులు ప్రపంచ వ్యాప్తంగా ఒక దానిపై ఒకటి నెరపే ప్రభావంతో, అంతటి ప్రమాణంగల సంఘీభావంతో, యిదివరకు మనకు తెలిసిన ప్రతి ఒక్కదాన్ని మించిన రూపాల్లో అనుసంధించాలి.

అది, అక్టోబరు సోషలిస్టు మహా విప్లవపు వారసత్వంలోని రెండు అంశాల అవిభాజ్య ఐక్యతకు—శాంతి సంప్రదాయంతో విప్లవ సంప్రదాయాల ఐక్యతకు—మూర్తీభావం. *

(11వ పేజీ తరువాయి)

పరిమాణం తక్కువేమీకాదు. జీవశాస్త్రరీత్యా వీలున్న ప్రమాణాలకు యీ నష్టాలను గనుక తగ్గించుకుంటే —యిది పరమోన్నత కర్తవ్యాల్లో ఒకటి—ఆహార సమస్య పరిష్కారమౌతుంది. యిది సాధ్యమోకాదో ఆచరణ తెలియజేస్తుంది. యేమైనప్పటికీ సత్ఫలితాలు లభించాలని మనం కోరుకుంటాం. *


SOVIET SAMEEKSHA (Telugu)
Vol. 21, No. 45
Nov. 6, 1987

CONTENTS

BCI

KLVA105M233

Regd. No. M. 8268



పెట్టుబడిదారీ ప్రపంచంలో హక్కులూ, స్వేచ్ఛలు

పేజీలు 70   ధర రూ. 6-00

పెట్టుబడిదారీ దేశాల్లో విడివిడి వ్యక్తులకుగల హక్కులపై, స్వేచ్ఛలపై విమర్శనాత్మక అధ్యయనం యీ పుస్తకంలో వుంది.

దొరుకుచోటు : విశాలాంధ్ర ప్రచురణాలయం, హైదరాబాదు-500001

BC

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA105M233
పుస్తకం పేరు	సోవియట్ సమీక్ష
తారీఖు	07 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	21
పెద్ద సైజు పేజీలు	No
ఖాళీ పేజీలు	CIBC
లేని పేజీలు	No
తయారు చేసినది	Vedavathi
పేజీలు విడదీసినది	Vedavathi
స్కాన్ చేసినది	Sakshi
పరీక్ష చేసినది	HEMA
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good